## దేశ సంస్కృతికి వట వృక్షం ఆరెస్సెస్

- ప్రధానమంత్రి నరేంద్రమోదీ

నాగ్‌పూర్: ఆరెస్సెస్ భారతీయ సంస్కృతి, ఆధునికతలకు వట వృక్షం (మర్రిచెట్టు) వంటిదని ప్రధాని మోదీ అభివర్ణించారు. సేవకు పర్యాయపదం ఆరెస్సెస్ అని ప్రశంసించారు. గత వందేళ్లలో ఆరెస్సెస్ చేసిన తపస్సు ఫలాలు దేశం 'అభివృద్ధి చెందిన భారత్' దిశగా పయనిస్తున్న తరుణంలో కనిపిస్తున్నాయన్నారు. రాజ్యాంగానికి 75 ఏండ్ల వేడుకలు జరుగుతున్న సమయంలో ఆరెస్సెస్ వందేళ్లు పూర్తి చేసుకుంటున్నదని చెప్పారు. మోదీ ప్రధాని పదవిని చేపట్టిన తర్వాత మొదటిసారి ఆదివారం నాగ్‌పూర్‌లోని ఆరెస్సెస్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించి మాట్లాడారు. అంతకుముందు ఆరెస్సెస్ వ్యవస్థాపకుడు హెడ్గేవార్ స్మృతి మందిరానికి వెళ్లి, ఆయనకు, గోల్వాల్కర్‌కు నివాళులర్పించారు. అనంతరం అంబేద్కర్ బౌద్ధ మతాన్ని స్వీకరించిన 'దీక్ష భూమి'ని సందర్శించారు. మాధవ్ నేత్రాలయ ప్రీమియం సెంటర్‌కు శంకుస్థాపన చేశారు. ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ మాట్లాడుతూ, నిస్వార్థంగా సేవ చేయడమే తమ సంస్థ సిద్ధాంతమని తెలిపారు.

## జిబ్లీ వాడకం తగ్గించరూ..ప్లీజ్..

- నెటిజన్లను కోరిన ఆల్ట్‌మన్

వాషింగ్టన్, మార్చి 30: చాట్‌జీపీటీలో ఇటీవల అందుబాటులోకి తీసుకొచ్చిన ఇమేజ్ జెనరేటర్ 'జిబ్లీ' స్టూడియోకు ప్రపంచవ్యాప్తంగా అనూహ్యమైన ఆదరణ లభిస్తున్నది. దీంతో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్..ఇలా దేంట్లో చూసినా జిబ్లీ ఫొటోలు కనిపిస్తున్నాయి. అయితే, జిబ్లీ ఇమేజ్ జనరేటర్‌ను విస్తృతంగా వాడటం వల్ల తమ ఉద్యోగులకు విశ్రాంతి లేకుండా పోయిందని ఓపెన్ ఏఐ సంస్థ సీఈవో శామ్ ఆల్ట్‌మన్ వాపోయారు. దయచేసి దీని వాడకాన్ని తగ్గించుకోవాలని నెటిజన్లను ఆయన కోరారు. 'జిబ్లీ వినియోగం చాలా ఎక్కువగా ఉంది. ఈ విషయంలో యూజర్లు కాస్త కూల్‌గా ఉంటే బాగుంటుంది. మా సిబ్బందికి నిద్ర కూడా అవసరం కదా!' అని ఆయన అన్నారు. జిబ్లీ స్టైల్ ఇమేజ్ జనరేటర్‌ను 'గ్రోక్'లోనూ యూజర్లు విరివిగా ఉపయోగిస్తున్నారు.

# డీపీలు మార్చి.. ఉద్యోగులను ఏమార్చి!

◆ కంపెనీ అధిపతులుగా అకౌంట్స్ ఉద్యోగులతో ఫోన్ చాటింగ్

- సీఎండీ, ఎండీ, సీఈవోల ఫొటోలతో వాట్సప్‌లో డీపీ సెట్టింగ్
- హైదరాబాద్‌లో వెలుగులోకి సైబర్ నేరగాళ్ల సరికొత్త మోసాలు
- సైబర్ ఉచ్చులో పడొద్దని సీఎస్‌బీ డీజీ శిఖాగోయల్ హెచ్చరిక

హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ కంపెనీ అకౌంట్స్ ఉద్యోగికి వాట్సప్‌లో మెస్సేజ్ వచ్చింది. అది కొత్త నంబర్ అయినా డీపీ చూస్తే సీఎండీ ఫొటో ఉంది. తన బాస్ అనుకుని ఆ ఉద్యోగి చాటింగ్ చేశాడు. కొత్త ప్రాజెక్ట్ కోసం కంపెనీ అకౌంట్ నుంచి తాను చెప్పిన నంబర్‌కు రూ.1.95 కోట్లు బదిలీ చేయాలని, ఈ విషయం ఎవరికీ చెప్పొద్దని మెస్సేజ్ చేసిన వ్యక్తి ఉద్యోగితో అన్నాడు. ఆ ఉద్యోగి డబ్బును సంబంధిత నంబర్‌కు పంపాడు. నెల తర్వాత బాస్ అకౌంట్స్ గురించి అడగడంతో విషయం.. "ఫలానా నంబర్‌కు అమౌంట్ పంపాలని మీరే చెప్పారు కదా!" అని ఉద్యోగి తెలిపాడు. ఫోన్ జరిగిన చాటింగ్ వివరాలు కూడా చూపించాడు. అది తాను కాదని బాస్ చెప్పడంతో... జరిగిన మోసం బయటపడింది. ఆ ఉద్యోగి సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించడంతో, పోలీసులు ఆ డబ్బును పూర్తిగా ఫ్రీజ్ చేశారు

హైదరాబాద్, మార్చి 30 (నమస్తే తెలంగాణ): సైబర్ నేరగాళ్లు కొత్త పంథాలు వెతుకుతున్నారు. అందినకాడికి డబ్బులు దండుకునేందుకు ఐటీ సంస్థల యజమానులు, హెచ్‌ఆర్ మేనేజర్లు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ల వెంట పడ్డారు. ఆయా కంపెనీల సీఎండీ, ఎండీ, సీఈవోల ఫొటోలతో డీపీలు సెట్ చేసుకుని, కంపెనీలోని అకౌంట్స్ ఆఫీసర్లు, హెచ్‌ఆర్ మేనేజర్లు, సంస్థల్లో పనిచేసే ఐటీ ఉద్యోగులకు మెసేజ్‌లు చేస్తూ లక్షల రూపాయలు దండుకుంటున్నారు. ఇటువంటి ఉదంతాలు తెలంగాణలో వెలుగు చూస్తుండటంతో సైబర్ సెక్యూరిటీ బ్యూరో పలు హెచ్చరికలు జారీ చేసింది. కార్పొరేట్ కార్యాలయాలు, ఐటీ కంపెనీల యజమానులు, ఉద్యోగులు కొత్తతరహా సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.




**వాట్సాప్ డీపీలతో మోసం**

కొత్త తరహా మోసాలు ఎలా జరుగుతున్నాయో సీఎస్‌బీ డీజీ శిఖాగోయల్ వెల్లడించారు. సైబర్ నేరగాళ్లు ఏదైనా ఓ సంస్థ యజమాని ఫొటోను వాట్సప్, మెయిల్ డీపీగా సెట్ చేసుకుంటున్నారని తెలిపారు. మెయిల్ ఐడీని కూడా సదరు కంపెనీ పేరుతోనే క్రియేట్ చేసుకుంటున్నారని చెప్పారు. ఆ తర్వాత కంపెనీలోని అకౌంట్స్, హెచ్‌ఆర్ విభాగంలోని ఉన్నత ఉద్యోగులకు మెస్సేజ్ చేస్తున్నారని, ట్రాప్‌లో పడ్డారని గుర్తించినప్పుడు కొత్త ప్రాజెక్ట్, ఎమర్జెన్సీ ప్రాజెక్ట్ కోసం అంటూ అత్యవసరంగా డబ్బులు పంపాలని చెప్తున్నారని వెల్లడించారు. కార్పొరేట్ ఆఫీసులే లక్ష్యంగా ఈ తరహా మోసాలు జరుగుతున్నాయని చెప్పారు.

### నేరుగా మాట్లాడిన తర్వాతే డబ్బు పంపాలి



ఉద్యోగులు చాలా జాగ్రత్తగా ఉండాలి. బాస్‌లు, పై అధికారుల పేరుతో ఎవరైనా వాట్సప్, మెయిల్ ద్వారా చాటింగ్ చేస్తుంటే ఫోన్ చేసి ఎవరో నిర్ధారించుకోండి. డబ్బులు అడుగుతున్నారంటే వాళ్లు కచ్చితంగా సైబర్ నేరగాళ్లు కావొచ్చు. అనుమానం వస్తే వెంటనే 1930కి కాల్ చేసి, www.cybercrime.gov.inలో రిపోర్ట్ చేయండి. ఎప్పటికప్పుడు కొత్త తరహా నేరాలపై అప్రమత్తత, అవగాహన అవసరం. డబ్బులు కోల్పోతే గంటలోపే రిపోర్ట్ చేయాలి.

– శిఖాగోయెల్, డీజీ సీఎస్‌బీ

# ట్రిపుల్ ఆర్ నిర్మాణం మరింత ఆలస్యం

- భూసేకరణ పూర్తయ్యేవరకూ ఆగినట్టే
- అందుకే ఏజెన్సీల ఖరారులో జాప్యం
- పరిహారం పెంచితేనే పనులు ముందుకు సాగే అవకాశం



హైదరాబాద్, మార్చి 30 (నమస్తే తెలంగాణ): ప్రాంతీయ రింగురోడ్డు (ట్రిపుల్‌ఆర్) ఉత్తర భాగం నిర్మాణం మరింత ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తున్నది. రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుండటం, భూసేకరణ ప్రక్రియ ఇంకా పూర్తకాకపోవడంతో కేంద్ర ప్రభుత్వం ఆచితూచి అడుగులు వేస్తోంది. అందువల్లే ఏజెన్సీలను ఖరారు చేయడంలో జాప్యం జరుగుతోంది. ముఖ్యమంత్రితోపాటు రోడ్లు, భవనాల శాఖ మంత్రి ఇప్పటికే పలుమార్లు జాతీయ రహదారుల శాఖ మంత్రిని కలిసి విజ్ఞప్తి చేసినా ఎలాంటి పురోగతి లేకపోవడమే ఇందుకు నిదర్శనం. ట్రిపుల్‌ఆర్‌ను రెండు దశల్లో అభివృద్ధి చేయాలని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇందులో తొలుత ఉత్తర భాగాన్ని నిర్మించేందుకు టెండర్ల ప్రక్రియ చేపట్టినప్పటికీ దాఖలైన బిడ్లను మాత్రం తెరవడంలేదు. జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖతోపాటు పీపీపీ అప్రైజల్ కమిటీ నుంచి గ్రీన్ సిగ్నల్ రాకపోవడమే ఇందుకు కారణమని తెలుస్తున్నది. దీంతో బిడ్లు తెరిచే గడువును ఇప్పటికే నాలుగుసార్లు వాయిదా వేశారు. భూసేకరణపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవడం, పలుచోట్ల కోర్టు స్టే ఉత్తర్వులు ఉండటంతో టెండర్ల విషయంలో తొందర పడరాదని కేంద్రం నిర్ణయించినట్టు అధికారవర్గాలు చెప్తున్నాయి. బిడ్లు తెరిస్తే ఎంపికైన ఏజెన్సీకి పనులు కేటాయించాల్సి వస్తుందని, ఆ తర్వాత ఏ కారణంచేతనైనా అవి ముందుకు సాగకపోతే ఏజెన్సీలు పనులను నిలిపివేసి న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతోపాటు భారీగా నష్ట పరిహారాన్ని డిమాండ్ చేస్తాయని, అందుకే అసలు బిడ్లే తెరవకుండా ఉంటే ఏ తలనొప్పీ ఉండదని, భూసేకరణ పూర్తయ్యాకే పనులు చేపడదామని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు భావిస్తున్నారు. దీనికి హైదరాబాద్–విజయవాడ రహదారిని ఉదాహరణగా చూపుతున్నారు. ఈ రహదారిని 8లేన్లుగా విస్తరించాలని ఒప్పందంలో ఉన్నప్పటికీ పనులు చేపట్టిన ఏజెన్సీ రాష్ట్ర విభజన వల్ల తనకు టోల్ వసూలు కావడంలేదనే కారణంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. పనులు నిర్వహించకపోవడంతో దాదాపు పదేళ్లపాటు ఈ రహదారి విస్తరణకు నోచుకోలేదు. తొందరపడి ట్రిపుల్ ఆర్ విషయంలో కూడా ఏజెన్సీని ఎంపికచేస్తే ఇలాగే జరుగుతుందని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు భావిస్తున్నట్టు సమాచారం.

**ఎకరం రూ.50 లక్షలు పలికే భూమికి రూ.6 లక్షల పరిహారమా?**

ట్రిపుల్‌ఆర్ నిర్మాణం కోసం భూములిచ్చే రైతులకు నష్టపరిహారాన్ని చాలా తక్కువగా నిర్ణయించడంతో భూసేకరణ ముందుకు సాగడం లేదు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో మార్కెట్ విలువ ప్రకారం ఎకరం రూ.2 లక్షలు, బహిరంగ మార్కెట్ ధర ప్రకారం రూ.50 లక్షలకుపైగా పలుకుతున్నది. కానీ, రూ.6 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో భూములిచ్చేందుకు రైతులు ససేమిరా అంటున్నారు. మొత్తం 4,682 ఎకరాల్లో 3,261 ఎకరాలకు అవార్డ్ పాస్ చేసినప్పటికీ ఇంకా నష్టపరిహారాన్ని చెల్లించలేదు. అందులో దాదాపు 200 ఎకరాల అటవీభూమి ఉండటంతో ఆ భూమికి బదులుగా అటవీశాఖకు మరోచోట భూమి ఇచ్చేందుకు ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తం చేసింది. మిగిలిన భూముల విషయంలో రైతుల వ్యతిరేకత, కోర్టు కేసులు అడ్డంకిగా ఉన్నాయి. 232 ఎకరాలపై కోర్టు కేసులు ఉండగా.. 1,107 ఎకరాలు ఆర్బిట్రేషన్ వద్ద విచారణలో ఉన్నాయి.

### పరిహారం పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి

ట్రిపుల్‌ఆర్‌ను నిర్మించే జిల్లాల్లో ఇప్పటికే భూముల ధరలను పెంచిన ప్రభుత్వం.. భూసేకరణ సమస్యల పరిష్కారానికి కలెక్టర్ల నేతృత్వంలో ఆర్బిట్రేషన్‌ను ఏర్పాటు చేసింది. ఆ భూములు పట్టణానికి దగ్గరగా ఉన్నాయా, వాటిలో ఏటా ఎన్ని పంటలు పండుతాయి, ప్రస్తుతం ఆ భూముల ధరలు ఎలా ఉన్నాయి. భవిష్యత్తులో వాటి విలువ ఏ మేరకు పెరగవచ్చన్న అంశాల ఆధారంగా ఆర్బిట్రేషన్ ఖరారు చేసిన ధరలను ఎన్‌హెచ్‌ఏఐ చెల్లించాల్సి ఉంటుంది. భూసేకరణ చట్టం ప్రకారం భూములు కోల్పోతున్నవారికి గ్రామీణ ప్రాంతాల్లో అయితే మార్కెట్ ధరకు కనీసం రెండు రెట్లు, పట్టణ ప్రాంతాల్లో అయితే నాలుగు రెట్లు అధికంగా నష్టపరిహారం చెల్లించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం చెల్లిస్తే భూసేకరణ సాధ్యంకాదని నిర్ణయానికొచ్చిన రాష్ట్ర ప్రభుత్వం.. రైతులకు సాధ్యమైనంత ఎక్కువ నష్టపరిహారం చెల్లించాలని కేంద్రాన్ని కోరింది. గతంలో ఎన్‌టీపీసీ చెల్లించిన విధంగా ఎకరాకు కనీసం రూ.30 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని కోరినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. కానీ, ఒకచోట అధికంగా చెల్లిస్తే ప్రతిచోటా ఇదే విధమైన డిమాండ్లు వస్తాయని, రోడ్ల నిర్మాణం ముందుకుసాగే వీలుండదని ఎన్‌హెచ్‌ఏఐ భావిస్తున్నట్టు తెలిసింది.




సహాయక చర్యలకు వెళ్తున్న రెస్క్యూ బృందాలకు సలహాలిస్తున్న ప్రత్యేకాధికారి శివశంకర్

# ఎస్‌ఎల్‌బీసీలో కొనసాగుతున్న సహాయక చర్యలు

- పండుగ పూట కూడా ఆగని ఆపరేషన్

నాగర్‌కర్నూల్, మార్చి 30 : నాగర్‌కర్నూల్ జిల్లాలోని దోమలపెంట సమీపంలోని ఎల్‌ఎల్‌బీసీ టన్నెల్‌లో ఉగాది రోజైన ఆదివారం కూడా కార్మికుల కోసం అన్వేషణ కొనసాగింది. ఈ మేరకు టన్నెల్ ప్రత్యేకాధికారి శివశంకర్ లోతేటి రెస్క్యూ బృందాల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించి సలహాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహాయక బృందాల శ్రమ నానాటికి గుర్తిండి పోతుందన్నారు. ఉగాది పండుగరోజు సైతం కుటుంబాలకు దూరంగా ఉంటూ సహాయక చర్యల్లో పాలొంటున్న రెస్క్యూ బృందాలను ప్రత్యేకంగా అభినందించారు. మొదటి రోజు నుంచే టన్నెల్ లోపల రెస్క్యూ ఆపరేషన్ చేయగల ఆర్మీ సిబ్బంది, ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, సింగరేణి, హైడ్రా, రైల్వే, జీఎస్ఐ, ఎన్‌జీఆర్ఐ, ర్యాట్ హోల్ మైనర్స్, ఐఐటీ మద్రాస్ ప్రొఫెసర్లు, కేరళ నుంచి ప్రత్యేక శిక్షణ పొందిన క్యాడవర్ డాగ్స్, రోబోటిక్ సహా అన్ని రకాల నిష్ణాతులను సాంకేతికతను ఉపయోగించుకుంటూ టన్నెల్ లోపల చిక్కుకున్న వారిని వెలికి తీసేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఆదివారం ప్రత్యేకాధికారితోపాటు సహాయక చర్యలను నాగర్‌కర్నూల్ అదనపు కలెక్టర్ దేవసహాయం, ఎన్‌డీఆర్‌ఎఫ్ అధికారి కిరణ్‌కుమార్, ఎస్‌డీఆర్‌ఎఫ్ అధికారి గిరిధర్‌రెడ్డి, సింగరేణి మైన్స్ రెస్క్యూ జనరల్ మేనేజర్ బైద్య, దక్షిణమధ్య రైల్వే అధికారి నేటిచంద్ర, హైడ్రా అధికారులు పర్యవేక్షించారు.

# రాబడి

## ఈ 5 పోస్టాఫీస్ స్కీములతో పన్ను లాభం

**తపాలా** శాఖ నుంచి వచ్చే చిన్న మొత్తాల పొదుపు పథకాలను.. దేశంలోనే అత్యంత సురక్షితమైన పెట్టుబడి సాధనాలుగా చెప్పవచ్చు. ఇందుకు కారణం భారత ప్రభుత్వం భరోసా ఉండటమే. పైగా ఆయా స్కీముల్లో పెట్టుబడులపై, వాటిద్వారా పొందే ఆదాయంపై ఆదాయ పన్ను చట్టం–1961లోని సెక్షన్ 80సీ కింద మదుపరులకు పన్ను మినహాయింపులూ వర్తిస్తాయి. ఆర్థిక సంవత్సరంలో రూ.1.5 లక్షలదాకా క్లెయిమ్ చేసుకోవచ్చు. ఇలాంటి ఐటీ ప్రయోజనాలున్న 5 పోస్టాఫీస్ స్కీములను ఒక్కసారి పరిశీలిస్తే..

**పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్)**

అత్యంత ప్రజాదరణ పొందిన దీర్ఘకాలిక పెట్టుబడి పథకాల్లో పీపీఎఫ్ ఒకటి. కనీస పెట్టుబడి రూ.500. గరిష్ఠం ఏటా రూ.1.5 లక్షలు. పీపీఎఫ్‌పై వడ్డీరేటు ఈ ఏడాది ఏప్రిల్–జూన్ త్రైమాసికానికి 7.1 శాతం. పీపీఎఫ్‌లో డిపాజిట్లకు, దానిపై పొందే వడ్డీ ఆదాయానికి, మెచ్యూరిటీ మొత్తాలను తీసుకున్నా ఎలాంటి పన్నులూ ఉండవు.

**నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్స్ (ఎన్‌ఎస్‌సీ)**

ఎన్‌ఎస్‌సీ అనేది ఓ ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ ఇన్వెస్ట్‌మెంట్ స్కీం. దీనిద్వారా గ్యారంటీడ్ ఆదాయం, ట్యాక్స్ సేవింగ్స్ రెండూ ఉంటాయి. ఈ ఏప్రిల్–జూన్ త్రైమాసికానికిగాను వడ్డీరేటు 7.7 శాతం. మెచ్యూరిటీపై పొందవచ్చు. ఇక ఈ స్కీంలో కనీసం రూ.1,000, గరిష్ఠంగా ఎంతైనా పెట్టుబడి పెట్టవచ్చు. ఎన్‌ఎస్‌సీ కాలపరిమితి ఐదేండ్లు. అయితే పెట్టుబడిపై రూ.1.5 లక్షలదాకా పన్నుండకపోయినా.. వడ్డీ ఆదాయంపై పన్నులుంటాయి. అయితే పన్ను ప్రయోజనాల కోసం తొలి నాలుగేండ్లలో రీఇన్వెస్ట్ చేసుకోవచ్చు.

**సుకన్య సమృద్ధి యోజన (ఎస్‌ఎస్‌వై)**

ఆడపిల్లల కోసం ఉద్దేశించిన పథకమే ఈ ఎస్‌ఎస్‌వై. ఇందులో పన్ను ప్రయోజనాలతో కూడిన అధిక రాబడులుంటాయి. కనీసం రూ.250, గరిష్ఠంగా ఏటా రూ.1.5 లక్షల వరకు పెట్టుబడిగా పెట్టవచ్చు. పెట్టుబడికి, వడ్డీ ఆదాయానికి, మెచ్యూరిటీ మొత్తాలకు పన్నులుండవు. ఈ ఏడాది ఏప్రిల్–జూన్‌కిగాను వడ్డీరేటు 8.2 శాతంగా ఉన్నది. వార్షిక ప్రాతిపదికన లెక్కిస్తారు. ఏటేటా చక్ర వృద్ధిని అనుసరించి లాభాల్ని అందిస్తారు.

**సీనియర్ సిటిజన్స్ సేవింగ్స్ స్కీం (ఎస్‌సీఎస్‌ఎస్)**

వృద్ధులను ఉద్దేశించి తెచ్చిన పథకం ఇది. ఎస్‌సీఎస్‌ఎస్‌లోనూ పన్ను ప్రయోజనాలతో కూడిన లాభాలుంటాయి. ఇందులో కనీస పెట్టుబడి రూ.1,000, గరిష్ఠ పెట్టుబడికున్న పరిమితి రూ.30 లక్షలు. అయితే పెట్టుబడిపై రూ.1.5 లక్షలదాకా పన్నుండకపోయినా.. వడ్డీ ఆదాయానికి పన్నుంటుంది. ఈ ఏప్రిల్–జూన్‌కిగాను వడ్డీరేటు 8.2 శాతం.

**ఐదేండ్ల పోస్టాఫీస్ టైం డిపాజిట్ (పీవోటీడీ)**

ఇందులో కనీస పెట్టుబడి రూ.1,000. గరిష్ఠంగా ఎంతైనా పెట్టుకోవచ్చు. వడ్డీ ఆదాయానికి పన్నులు వర్తిస్తాయి. రూ.1.5 లక్షల దాకా పెట్టుబడులకు పన్ను మినహాయింపులుంటాయి. అయితే ఐదేండ్లలోపు పెట్టుబడులను వెనక్కి తీసుకుంటే పన్ను ప్రయోజనాలు వర్తించవు. ఈ ఏప్రిల్–జూన్‌కిగాను వడ్డీరేటు 7.5 శాతం. మూడు నెలలకోసారి లెక్కించి ఏడాదికోసారి చెల్లిస్తారు.






# గోల్డ్ Vs నిఫ్టీ 50

## దీర్ఘకాల పెట్టుబడికి ఏది ఉత్తమం?

**దేశీయ** స్టాక్ మార్కెట్లలో ఇటీవలి ర్యాలీ బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) సూచీ సెన్సెక్స్, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీలకు గొప్ప లాభాలనే అందించింది. ఒక్క వారంలోనే సుమారుగా సెన్సెక్స్ 4.35 శాతం, నిఫ్టీ 4.45 శాతం చొప్పున ఎగిశాయి మరి. అయితే ఇన్వెస్టర్స్ పోర్ట్‌ఫోలియోలో బంగారం, వెండికి ప్రత్యామ్నాయంగా స్టాక్ మార్కెట్ పెట్టుబడులను ఎంచుకోవడానికి లేదా పెంచుకోవడానికి ఇది చాలదు. ఎందుకంటే ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా అంటే జనవరి–మార్చిలో అటు సెన్సెక్స్, ఇటు నిఫ్టీ రెండూ ఇంచుమించుగా 1 శాతం, 0.60 శాతం చొప్పున పడిపోయాయి. ఇదే సమయంలో బంగారం, వెండి ధరలు దాదాపు 17 శాతం, 15 శాతం మేర పెరిగాయి. ఇంకా లోతుగా చెప్పాలంటే జనవరి 1న సెన్సెక్స్ 78,139.01 పాయింట్ల వద్ద మొదలైంది. ఇప్పుడిది 77,414.92 పాయింట్ల వద్ద ఉన్నది. అలాగే నిఫ్టీ 23,644.80 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. ప్రస్తుతం 23,519.35 పాయింట్ల వద్ద నిలిచింది. ఫలితంగా సెన్సెక్స్ 724.09 పాయింట్లు, నిఫ్టీ 125.45 పాయింట్లు కోల్పోయినట్టైంది. కానీ బంగారం ధర రూ.78,950 నుంచి రూ.92,150కి ఎగబాకింది. వెండి ధర రూ.89,700 నుంచి రూ.1,03,000లకు చేరింది. దీంతో గోల్డ్, సిల్వర్ రేట్లు గడిచిన 3 నెలల్లో రూ.13,200, రూ.13,300 చొప్పున ఎగిసినట్టైంది.

**ఇదీ సంగతి..**

పైన చెప్పుకున్న లెక్కలన్నీ స్వల్పకాలిక పెట్టుబడి ఆధారిత గణాంకాలే. కానీ మనం ఇక్కడ చెప్పుకోవాల్సింది దీర్ఘకాలిక పెట్టుబడికి ఏది ఉత్తమం? అన్నదే. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌ల పెంపు హెచ్చరికలు.. భారత్‌సహా ప్రపంచ స్టాక్ మార్కెట్లను కుప్పకూల్చాయి. దీంతో మెజారిటీ ఇన్వెస్టర్లు తమ పెట్టుబడుల రక్షణార్థం బంగారం దిశగా అడుగులు వేస్తున్నారు. ఈ పరిణామాలు స్టాక్ మార్కెట్ సూచీలను దిగువకు, గోల్డ్, సిల్వర్ సూచీలను ఎగువకు పంపాయి. ఇక భారత్ విషయానికొస్తే.. బంగారాన్ని సురక్షిత మదుపు సాధనంగా భావిస్తుంటే, బ్రాడర్ ఈక్విటీ మార్కెట్‌కు, దేశ ఆర్థిక ప్రగతికి నిఫ్టీనే ప్రాతిపదికగా తీసుకుంటారు. కాబట్టి మదుపరుల పెట్టుబడి లక్ష్యాలు, రిస్క్ అనేవి ఇక్కడ కీలకం అని గుర్తుంచుకోవాలి. వాటి ప్రకారం..

**దీర్ఘకాల రాబడులు**

గడిచిన రెండు దశాబ్దాల్లో దేశీయంగా మదుపరులకు బంగారంపై పెట్టుబడులు 8–10 శాతం మేర చక్ర వార్షిక వృద్ధిరేటును అందించాయి. అనిశ్చిత పరిస్థితుల్లోనూ పసిడిపై మదుపు ఆకర్షణీయ ప్రదర్శననే ఇచ్చింది. అయితే దీర్ఘకాలంలో నిఫ్టీలో పెట్టుబడులు 12–15 శాతం వరకు చక్ర వార్షిక వృద్ధిరేటును చూపాయి. దీంతో వృద్ధికే మీ ప్రాధాన్యత అయితే నిఫ్టీ పెట్టుబడులే లాభదాయకం.

**ద్రవ్యోల్బణం సవాళ్లు**

ద్రవ్యోల్బణాన్ని అధిగమించాలంటే బంగారం చక్కని సాధనం. కరెన్సీ విలువ తగ్గితే ఇది పెరుగుతుంది. ఇక స్టాక్ మార్కెట్లు సైతం ద్రవ్యోల్బణాన్ని మించి పరుగులు పెడుతున్నాయి. కంపెనీల లాభాలు, ఆదాయం గణనీయంగా పెరుగుతుండటంతో నిఫ్టీదే పైచేయి.

**ఒడిదుడుకులు**

పుత్తడి ధరల్లో ఒడిదుడుకులు తక్కువే. ముఖ్యంగా ఆర్థిక సంక్షోభాల ప్రభావం పెద్దగా ఉండదు. స్టాక్ మార్కెట్లపై ప్రతీ చిన్నదాని ప్రభావం కనిపిస్తుంది. అయినా త్వరగా కోలుకుంటాయి. స్థిరత్వాన్ని కోరుకునే మదుపరులకు బంగారమే ఉత్తమం. అయితే ఒడిదుడుకులను తట్టుకుని, ఓపిగ్గా ఎదురుచూస్తే నిఫ్టీ లాభం.

**ద్రవ్య లభ్యత**

భౌతిక బంగారాన్ని నగదుగా మార్చుకోవడం కొంత ఇబ్బంది. నాణ్యత, తయారీ ఇతరత్రా ఖర్చులు ఎదురవుతాయి. డిజిటల్ గోల్డ్, గోల్డ్ ఈటీఎఫ్‌లకు ఈ సమస్య ఉండదు. స్టాక్ మార్కెట్లలో షేర్ల క్రయవిక్రయాలు సులభం. నగదు లభ్యత వేగంగానే ఉంటుంది. కాబట్టి పసిడి కంటే నిఫ్టీ ఇన్వెస్ట్‌మెంట్స్‌నే త్వరగా క్యాష్ చేసుకోవచ్చు.


**పోర్ట్‌ఫోలియో**

బంగారం ఇన్వెస్టర్ల పోర్ట్‌ఫోలియోలో రిస్క్‌ను తగ్గిస్తుంది. కానీ స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో ఉంటాయి. అయితే దీర్ఘకాల పెట్టుబడులకు ఈక్విటీలే సరైనవని మెజారిటీ ఎక్స్‌పర్ట్స్ మాట.

**చివరగా..**

మార్కెట్‌లో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులనుబట్టి తమ పోర్ట్‌ఫోలియోల్లో స్థిరత్వాన్ని కోరుకునే భారతీయ మదుపరులకు బంగారంపై పెట్టుబడులే ఉత్తమం. అయితే పోర్ట్‌ఫోలియోల్లో వేగవంతమైన వృద్ధిని కోరుకునే ఇన్వెస్టర్లకు ఈక్విటీలే నయం. అయితే నిపుణుల సలహాతో ముందుకెళ్తే మరింత లాభదాయకం.

# ఆటో, జీఎస్టీ గణాంకాలు కీలకం!





**మార్కెట్ పల్స్**

**దేశీయ** స్టాక్ మార్కెట్లు గత వారం పడుతూ, లేస్తూ కొనసాగినా లాభాలనైతే నిలబెట్టుకున్నాయి. విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్ఐఐ) ఆఖర్లో పెట్టుబడులకు ముందుకు రాకున్నా సూచీలు వృద్ధినే కనబర్చాయి. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 509.41 పాయింట్లు లేదా 0.66 శాతం లాభపడి 77,414.92 వద్ద ఆగింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 168.95 పాయింట్లు లేదా 0.72 శాతం పెరిగి 23,519.35 దగ్గర నిలిచింది. అయితే ఈ వారం మదుపరుల పెట్టుబడులు ఫిబ్రవరి ఆటో అమ్మకాలు, వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) గణాంకాల ఆధారంగా కొనసాగే వీలున్నట్టు మెజారిటీ నిపుణులు చెప్తున్నారు. అయినప్పటికీ డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ కదలికలు కీలకమని గుర్తుచేస్తున్నారు. అలాగే గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, ఎఫ్ఐఐ పెట్టుబడులు, ముడి చమురు ధరలు, అంతర్జాతీయ పరిణామాలూ దేశీయ మార్కెట్లను ప్రభావితం చేస్తాయని చెప్పవచ్చు. కాగా, అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 23,200 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 22,900 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 23,800–24,000 స్థాయికి వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

*గమనిక..*

***స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదుడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.***

# ఆరోగ్య బీమా.. ఓ స్మార్ట్ పెట్టుబడి




**నేడు** వైద్య ఖర్చులు ఏ స్థాయిలో పెరిగిపోయాయో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఈ నేపథ్యంలో ప్రతీ ఒక్కరికీ ఆరోగ్య బీమా తప్పనిసరి అంటే ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకోవడం.. మీ కుటుంబ భవిష్యత్తుపై పెట్టుబడి పెట్టినట్టే. ఇక గతంతో పోల్చితే ప్రస్తుతం అందుబాటులో ఉంటున్న ఆరోగ్య బీమా పాలసీలు.. కేవలం దవాఖానల్లో చేరికలకేగాక, ఓపీడీ సంప్రదింపులు, టెలీ మెడిసిన్, ముందస్తు వైద్య పరీక్షలు, ప్రసూతి, మానసిక, రిహాబిలిటేషన్, ఇతర ఆరోగ్య సంరక్షణ సేవల్నీ అందిస్తుండటం విశేషం. నిజానికి మారిన జీవనశైలితో ఇప్పుడు చాలా మంది వయసుతో సంబంధం లేకుండా షుగర్, బీపీ సమస్యల్ని ఎదుర్కొంటున్నారు. గుండె–కిడ్నీ సమస్యలు, క్యాన్సర్ వంటి ప్రమాదాలబారిన కూడా పడుతున్నారు. దీంతో ఇలాంటివారికి ఆరోగ్య బీమా, ప్రధానంగా క్రిటికల్ ఇల్‌నెస్ రైడర్లుండే పాలసీల అవసరం చాలా ఉంటున్నది. ఇలాంటి కవరేజీలను ఎస్బీఐ జనరల్ ఇన్సూరెన్స్‌సహా అనేక సంస్థలు ప్రభావవంతంగా అందిస్తున్నాయి. పైగా ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 80డీ కింద ఆరోగ్య బీమా కోసం చెల్లించే ప్రీమియంలపై పన్ను మినహాయింపులనూ అందుకోవచ్చు. 60 ఏండ్లలోపువారికి ఏటా రూ.25,000దాకా, ఆపై వయసున్న సీనియర్ సిటిజన్లకు రూ.50,000 వరకు పన్ను మినహాయింపులను పొందవచ్చని నిపుణులు చెప్తున్నారు. కాబట్టి ఈ ఉగాదితో మొదలైన కొత్త ఏడాదిలో ఆరోగ్య బీమా ఆవశ్యకతను గుర్తించి ఓ సానుకూల నిర్ణయం తీసుకోండి. ఒకవేళ ఇప్పటికే ఆరోగ్య బీమా ఉన్నట్టైతే.. సమగ్ర కవరేజీలుండే, ఇంటిల్లిపాదికి అవసరమయ్యే మరింత మెరుగైన బీమాను కొనడం ఉత్తమం.

